# అర్పణ

రామనాథం గోదావరి గట్టున కూర్చున్నాడు. సూర్యోదయమైంది. లేత అరుణకాంతులకు గోదావరిలోని చిరు అలలు మెరుస్తున్నాయి. కొందరు రేవులో స్నానాలు చేస్తున్నారు. పక్కనే వున్న పావంచాలమీద ఓ ముసలాయన దాలివేసి, దానిమీద యిత్తడి గిన్నెలో అన్నం వుడకపెడుతున్నాడు. దాలి మండకపోతే తాటాకు విశనకర్రతో విసురుతున్నాడు. ఎదురుగా వున్న బ్రాహ్మణుడు ఏవో మంత్రాలు చదువుతున్నాడు. దాలిలోంచి వచ్చే పొగ ముసలాయన్ని యిబ్బంది పెడుతోంది. అలాగే మళ్ళీ తాటాకు విశనకర్రతో విసురుతూ, బ్రాహ్మణుడు చెప్పినట్లే చేస్తున్నాడాయన.

రామనాథం కూడా అ పనిమీద వచ్చినవాడే! రామనాథం తండ్రి పోయాడు. తండ్రి పోయింది రాజమండ్రిలో కావడంతో – కర్మకాండ అంతా అక్కడే జరిపించాల్సి వచ్చింది. స్వస్థలం కూడా అదే. సాధారణంగా కర్మకాండ గోదావరీ తీరాన జరిపితే పితృదేవతలు తృప్తి చెందుతారని నమ్మకం. అందుకని రామనాథం, తండ్రి ఆత్మతృప్తికోసం, పితృదేవతల తృప్తికోసం యధావిధిగా కర్మకాండ గోదావరీతీరానే జరుపుతున్నాడు. గుండు చేయించుకున్నాడు. దీక్షావస్త్రం కట్టుకున్నాడు. పై పంచి వేసుకున్నాడు. రేవులో ఓ మెట్టుమీద తమ బ్రహ్మగారి కోసం ఎదురుచూస్తున్నాడు.

బ్రహ్మగారు వచ్చారు. కావలసిన సరంజామా అంతా బ్రహ్మగారే తెచ్చారు. రోజూ ఆయనే తెస్తున్నారు.

'రండి బాబూ! కాస్త ఆలశ్యమైంది యీ వేళ' అంటూ బ్రహ్మగారు తాను తెచ్చిన సామాగ్రి సంచిలోంచి బయటకు తీస్తున్నాడు.

"స్నానం చేసి వస్తాను" అంటూ రామనాథం గోదావరిలోకి దిగాడు.

అది డిశంబరు నెల. నీరు ఆకాశం రంగులో చాలా శుభ్రంగా వుంది. చలిచలిగా వుంది.

రెండు మునకలు వేసేసరికి రామనాథానికి చలిపోయింది. మూడవ మునకవేసి తడిబట్టలు పిండుకున్నాడు వడ్డుకువచ్చి.

అ బట్టలతోటే బ్రహ్మగారి ముందు కూర్చున్నాడు. రామనాథం తండ్రిపోయి ఆ వేళటికి నాలుగోరోజు. 'బియ్యం కూడా కడుక్కురండి' అంటూ బ్రహ్మగారు పెసరపప్పు బియ్యం వున్న గుండ్రని యిత్తడి గిన్ని రామనాథానికి అందించారు.

రామనాథం గిన్నె అందుకొని జాగ్రత్తగా తక్కువ నీళ్ళనే గిన్నెలోకి ముంచి, బియ్యం పెసరపప్పు కడిగి కుడితి వంచేసాడు. మళ్ళీ కావలసినంత వరకూ నీరును గిన్నెలోకి తీసుకున్నాడు.

అలా మడిగా, తడిబట్టలతో కడిగిన బియ్యం, పప్పుగల గిన్నెను తెచ్చి దాలిమీద వుంచాడు రామనాథం. బ్రహ్మగారే మంత్రాలు చదువుతూ - రామనాథం చేత అచమానం చేయించి కార్యక్రమం ప్రారంభించారు. పొగపోవడానికి బ్రహ్మగారే అట్ట విశనకర్రతో దాలిని విసురుతున్నారు. ఆయన తిప్పమన్నట్టు ధంజాన్ని తిప్పుతూ, అనమన్న మంత్రాలు అంటూ ఎంతో శ్రద్ధతో రామనాథం తండ్రి శ్రాద్ధకర్మ చేస్తున్నాడు.

నిజానికి రామనాథం అంత శ్రద్ధగా తండ్రి కర్మ చేస్తాడని రామనాథాన్ని ఎరిగినవారెవరూ అనుకోరు. అసలు రామనాథం అంత దీక్షతో, నిష్టగా కర్మ చేసాడంటే నమ్మరు కూడా. అతను గుండు చేయించుకున్నాడంటేనే నమ్మరు. అతను చదువుకొనే రోజుల్నుంచీ కూడా లెఫ్టిస్టుగానే గుర్తించబడ్డాడు. దేవుడు, పునర్జన్మలూ, కర్మ సిద్ధాంతం లాంటి వాటిమీద నమ్మకం లేని మనిషి. దేవుడుకంటే మనిషే ముఖ్యం అని నమ్మిన మనిషి రామనాథం. అందుకే అతను యింత శ్రద్ధగా యీ కర్మకాండ సాగిస్తున్నాడంటే ఎవరూ నమ్మరు. కాని రామనాథం యింత శ్రద్ధగా తండ్రి కర్మకాండ జరిపించడానికి కారణం వుంది. తన నమ్మకాలు ఏమైనా తన తండ్రి అవసాన కాలంలో తనని కోరిన కోరిక, తనచేత యింత పని చేయిస్తోంది.

'బాబూ! నీ నమ్మకాలు నేనెప్పుడూ కాదనలేదు. నీ సిద్ధాంతాలకు నేను అడ్డురాలేదు. అలాగే నా నమ్మకాలను కూడా నువ్వు కాదనకుండా గౌరవిస్తేనే సంతోషిస్తాను బాబు! నా ఆత్మ కూడా సంతోషిస్తుంది' అన్నాడు కొడుకుచేతిని తన చేతుల్లోకి తీసుకొని రామనాథం తండ్రి.

'ఏం చేయమంటారో చెప్పండి నాన్నా!' అన్నాడు రామనాథం.

'యధావిధిగా నా అంత్యక్రియలు జరిపించాలి బాబు. తద్దినాలు పెట్టాలి.'

రామనాథం యివన్నీ జరిపించకూడదని అనుకోలేదు అంతవరకు. కాని రామనాథం గురించి తెలిసిన అతని తండ్రికి రామనాథం యివన్నీ జరిపిస్తాడన్న నమ్మకం లేదు. అందుకే కొడుకుని బతిమాలుకున్నాడు పెద్దమనిషి.

అది - తండ్రీ కొడుకుల అనుబంధం. చివరి ఘడియల్లో తండ్రి అభ్యర్ధనను కాదనలేకపోయాడు రామనాథం.

'అన్నీ యధావిధిగా జరిపిస్తాను నాన్నగారు' అన్నాడు రామనాథం. అప్పటికే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'కొడుకు బాధ్యతలలో యిది చాలా ముఖ్యమైందంటారురా మన పెద్దలు' అన్నాడు తండ్రి.

'నేను అన్నీ జరిపిస్తానన్నానుగా' హామీ యిచ్చాడు రామనాథం తండ్రికి.

ఆయన ఆ రాత్రే నిశ్చింతగా కళ్ళు మూసాడు.

ఆ క్షణంనుంచీ బ్రహ్మగారూ, పెద్దలూ ఎలా చెబితే అలా తండ్రి అంత్యక్రియలు జరిపిస్తున్నాడు రామనాథం.

అన్నం పప్పు వుడికాయి.

అరటాకు పరచి, తడిబట్టతో తుడిచాడు రామనాథం.

'ఆకులోకి దిమ్మరపోయండి' బ్రహ్మగారు చెప్పాడు.

ఆకులోకి దిమ్మర పోసాడు రామనాథం.

ఆ అన్నంమీద గిన్నెడు నెయ్యి పోసాడు, బెల్లంపొడి చల్లాడు.

ఇప్పుడు 'నాన్నగారికి నైవేద్యం పెట్టండి' అన్నాడు బ్రహ్మగారు.

నీళ్ళు జల్లి, మనసులోనే తండ్రిని తలుచుకొని - విస్తరిచుట్టూ చెయ్యి తిప్పి నైవేద్యం పెట్టాడు రామనాథం.

'ఇప్పుడు ఆ విస్తర్ని రోజులాగే అలా యడంగా ఆ చివరి మెట్టుమీద వుంచిరండి. కాకులు వచ్చి తింటాయి' అన్నాడు బ్రహ్మగారు.

చెప్పిన ప్రకారమే విస్తరి తీసుకువెళ్ళి దూరంగా చివరిమెట్టు మీద పెట్టడానికి బయలుదేరబోతూ ఒక్కక్షణం అగాడు రామనాథం.

'యీ అన్నం కాకులకే ఎందుకు పెట్టాలి బ్రహ్మగారూ' అన్నాడు రామనాథం.

'కాకుల ద్వారానూ, గద్దల ద్వారానూ జలచరముల ద్వారానూ, పితృదేవతలకు యీ పిండం చేరుతుందని శాస్త్రం బాబూ' అన్నాడు బ్రహ్మగారు.

'మనిషికి పెట్టకూడదా?' రామనాథం అడిగాడు.

'మనిషికి పెట్టవచ్చునీ లేదు, పెట్టకూడదనీ లేదు' బ్రహ్మగారు బదులు చెప్పాడు.

'అంటే పెట్టకూడదని లేదుగా?'

'లేదనుకోండి. మనిషికి పెట్టడం ఆచారం కాదు.'

'నలుగురు చేస్తే అదే ఆచారం అవుతుంది. యీ మంత్రాలు, ఈ తంతూ గతంలో కొందరు చేయడం మూలంగానే కదా యీ నాటికి ఆచారంగా మారింది. మనిషి పేరు చెప్పి మరో మనిషికి పెట్టడం కంటే జంతువులకు పెట్టడంలో ఔచిత్యం ఏముంది' అంటూ రామనాథం ఆ విస్తర్ని తీసుకువెళ్ళి అఖరి మెట్టుమీద పెట్టకుండా గోదావరి గట్టుమీద చెట్టుకింద కూర్చున్న అడుక్కునే గుడ్డివాడి ముందు వుంచాడు.

'తాతా నీ ముందు ఆకులో అన్నం పప్పు నెయ్యి బెల్లం వున్నాయి. తిను' అన్నాడు రామనాథం.

'దేవుడు నిన్ను చల్లగా సూడాలి బాబు' అన్నాడు ఆ గుడ్డి బిచ్చగాడు.

కళ్ళున్న బ్రహ్మగారు కలయో వైష్ణవమాయయో అన్నట్లు అలా చూస్తూ వుండిపోయాడు.

'ఈ కాకులూ, గద్దలూ, చేపలూ తింటే నా తండ్రికి ముదుతుందో లేదో గాని - నా తండ్రికి వేసే పిండం, ఓ మనిషి ఆకలి తీర్చింది. నాకు తృప్తిగా వుంది' అనుకున్నాడు రామనాథం.

* * *